క్లుప్తంగా

నేడు కంటి వైద్యశిబిరం

భానుపురి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం సూర్యాపేట కార్యాలయం లో వరంగల్‌కు చెందిన శరత్ లేజర్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దండా శ్యాం సుందర్ రెడ్డి, సుదగాని నాగేశ్వరరావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం పదిగంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే వైద్యపరీక్షలకు పెన్షనర్లు, ఆరోగ్యశ్రీ కార్డుదారులు, జర్నలిస్టులు తమకార్డులు తీసుకురావాలని కోరారు. వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలకు ఫర్నిచర్ అందజేత



దాత అందించిన ఫర్నిచర్‌తో ఉపాధ్యాయులు

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని ఏపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అమెరికాలో ఉంటున్న ఎన్నారై సంపత్‌కుమార్ సాయంతో పబ్బతి వెంకటేశ్వర్లు సమన్వయంతో ఆదివారం ఫర్నిచర్‌ను అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎండీ బాసిత్ మాట్లాడారు. పాఠశాలలో వసతులు లేని విషయాన్ని తెలుసుకున్న దాత సంపత్‌కుమార్ పాఠశాలకు 15 కుర్చీలు సమకూర్చారని, అలాగే వాల్ పెయింటింగ్స్ వేయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రమణ, వేణు, పుష్పకుమారి, విజయ్ కుమార్, వెంకటేష్, నాగేందర్, విజయ్, విజయ మోహన్, రవి శాస్త్రి, నస్రిన్ తదితరులు పాల్గొన్నారు.

'రైతుబంధు రద్దుకు ప్రభుత్వం కుట్ర'

నూతనకల్ : ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని రద్దు చేయడం కోసం కుట్ర పన్నిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్య యాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రైతుబంధు పథకం ద్వారా ఎకరానికి రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. కానీ సంవత్సరం గడిచినా రైతుబంధును అమలు చేయలేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సాగు పెట్టుబడికి రైతుబంధు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గాజుల తిర్మల్ రావు, కొచ్చెర్ల బాబు, జక్కి పరమేష్, బత్తుల విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీటీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

మోతె : మండల కేంద్రం నుంచి ఎన్‌హెచ్-9 వరకు రూ.25కోట్లతో చేపట్టనున్న డబుల్ రోడ్డు నిర్మాణానికి సోమవారం మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి శంకుస్థాపన చేయనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



మృతుడి కుటుంబీకులను పరామర్శిస్తున్న డీసీసీ ఉపాధ్యక్షుడు యోగానందచారి

అర్వపల్లి : మండల పరిధిలోని కొమ్మాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గంగదేరి సైదులు మృతిచెందారు. దీంతో మృతుడి కుటుంబీకులను కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపాక సత్యం, బౌరోజు ఉపేందర్, గంగదేరి శ్రీను, రమేష్, సాయిలు, మధు పాల్గొన్నారు.

కార్తీక అమావాస్య పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని పర్సాయపల్లి గ్రామ జంగాలబోడుపై ఉన్న భవాని సమేత జంగమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం కార్తీకమాస అమావాస్య సందర్భంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిత్య అఖండ దీపారాధన జరిపారు. కార్తీక దీపోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకుడు మోత్కూరి రాజుశర్మ, భక్తులు రాగి అనిల్, శ్రావణ్, కొత్త సంతోష్‌రెడ్డి, బానోతు హుస్సేన్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ర్యాలీలు



అర్వపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



నాగారంలో ర్యాలీలో పాల్గొన్న వైద్యసిబ్బంది

అర్వపల్లి : ఎయిడ్స్ రహిత సమాజాన్ని నెలకొల్పడానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ నగేష్‌నాయక్ కోరారు. ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా అర్వపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ లలిత, నర్సింగ్ ఆఫీసర్ సునీత, ఎంఎల్‌హెచ్‌పీలు వాణి, వర్షిత, గౌతమి, హెల్త్‌అసిస్టెంట్‌లు కుంభం వీరయ్య, సైదమ్మ, దుర్గమ్మ, జ్యోతి, శకుంతల, నాగరాణి, ఊర్మిళ, గిరిజ, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

నాగారం : ఎయిడ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ బి.హర్షవర్ధన్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ఆదివారం నాగారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధికి మందు లేదని, నివారణ ఒక్కటే మార్గమని తెలిపారు. సురక్షితం కాని లైంగిక సంపర్కం వల్ల, రక్తమార్పిడి ద్వారా, కలుషితమైన సిరింజీల వాడకం ద్వారా ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉందని అన్నారు. ఎయిడ్స్ వ్యాధి అంటు వ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని అన్నారు. ఎవరైనా హెచ్ఐవీ వైరస్ బారిన పడితే ఏఆర్‌టీ సెంటర్‌లో మందులు వాడి జీవిత కాలం పెంచుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో పల్లె డాక్టర్ శ్రవణ్‌కుమార్, సీహెచ్ఓ మాలోతు బిచ్చునాయక్, సూపర్‌వైజర్ హెచ్ఈ విమలమ్మ, పీహెచ్ఎన్ అరుణకుమారి, వినోద, యాదగిరి, ప్రవీన్‌రెడ్డి, లక్ష్మీబాయి, బేబీ పాల్గొన్నారు.

తిరుమలగిరి ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో..

తిరుమలగిరి : తిరుమలగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ ఏయిడ్స్ డే సందర్భంగా ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధి నిర్మూలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి వందన, వైద్య సిబ్బంది నర్సింహారెడ్డి, విజయ్, రమాదేవి పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన పెంపొందించుకొని వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని మండల వైద్యాధికారి స్రవంతి కోరారు. ఆదివారం ఎయిడ్స్ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్యశాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సుఖవ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు పాటిస్తూ ఎయిడ్స్‌ను నిర్మూలించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ చంద్రశేఖరరాజు, ఎంఎల్‌హెచ్‌పీలు రవీందర్, అనూష, ప్రియాంక, ఝాన్సీ, పూజ, ఏఎన్ఎంలు వీరమ్మ, సుభద్ర, రేణుక, సైదమ్మ, మణెమ్మ, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



తిరుమలగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



పెన్‌పహాడ్‌లో ర్యాలీలో పాల్గొన్న వైద్యసిబ్బంది

అపరిశుభ్రంగా పాఠశాల ఆవరణ



అర్వపల్లిలోని జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో వర్షపు నీరు నిలిచి అపరిశుభ్రంగా మారిన పరిసరాలు



నీటిలో పెరుగుతున్న జమ్మి

అర్వపల్లి : అర్వపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ కొన్నేళ్లుగా వర్షపు నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. సమీపంలోని గుట్ట నుంచి వచ్చే వరద పాఠశాల ఆవరణలో చేరి నిరంతరం అలాగే ఉంటుంది. ఈ నీళ్లు ప్రస్తుతం పచ్చగా మారి దుర్వాసన వస్తోంది. ఈ నీటిలోనే చేతి పంపు ఉంది. మిషన్ భగీరథ నీళ్లు రాని సమయంలో ఈ చేతిపంపు నీటినే విద్యార్థులు వాడుకుంటున్నారు. ఇటీవల 10 రోజుల పాటు భగీరథ నీళ్లు నిలిచిపోగా విద్యార్థులు ఈ చేతిపంపు నీటిని వాడుకున్నారు. అయితే పాఠశాల ఆవరణలో నిలిచిన నీళ్ల చెరువును తలపిస్తున్నాయి. ఈ నీటిలో జమ్మి దట్టంగా పెరిగింది. పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిలువకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు సంబంధిత అధికారులకు ఎన్నో ఏళ్లుగా మొరపెట్టుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

విద్యుదాఘాతంతో గేదె మృతి

నాగారం : డి.కొత్తపల్లిలో ఆదివారం విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. డి.కొత్తపల్లి గ్రామానికి చెందిన వేముల సైదులు తన గేదెలను రోజువారిగానే వ్యవసాయక్షేత్రంలోకి మేతకు తోలుకెళ్లాడు. ఈ క్రమంలో ఒక గేదె మేత మేసుకుంటూ విద్యుత్ స్తంభం దగ్గరకు వెళ్లగా అక్కడ విద్యుత్ వైర్లు గేదె తలకు తగిలాయి. దీంతో విద్యుదాఘాతం ఏర్పడి గేదె అక్కడిక్కడే మృతి చెందింది. ఈ గేదె విలువ సుమారు రూ.60వేల వరకు ఉంటుందని రైతు వాపోయాడు. ప్రభుత్వం తనకు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలన కోరాడు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలి

తుంగతుర్తి : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా ప్రజలకు, రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించకుండా రైతుల పండుగ పేరుతో కాలయాపన చేస్తోందన్నారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ నాయకులు తునికి సాయిలు, గాజుల యాదగిరి తదితరులు ఉన్నారు.

వైభవంగా శ్రీరామ మూల మంత్ర హోమం



శ్రీరామ మూల మంత్ర హోమంలో పాల్గొన్న భక్తులు

సూర్యాపేట : పట్టణంలోని శ్రీరామ్‌నగర్ విజయాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం రామ మూల మంత్ర హోమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు శ్రీరామ తారక జపయజ్ఞంలో పరవశించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మరింగంటి వరదాచార్యులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు మండల్ రెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకొని రామనామ జపం లక్షసార్లు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా రెండు లక్షలు దాటినట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయంలో నిర్వహించిన రామ మూల మంత్ర హోమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి నాగవెల్లి దశరథ, సలహాదారులు కీసర అంజన్‌రెడ్డి, నాగవెల్లి ప్రభాకర్, కోశాధికారి యలమద్ది అశోక్ కుమార్, సామ వెంకటరెడ్డి, గడ్డం ప్రతాప్‌రెడ్డి, అజిత, జొన్నలగడ్డ గీత, బాల నాగమ్మ, రమేష్, లక్ష్మణరావు, దొనకొండ శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

నూతనకల్ : వసతి గృహాల్లో మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు పప్పు, పెరుగు, గ్రుడ్లు వంటి పోషకాహార పదార్థాలను అందించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారి పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలానికి చెందిన పలువురు నాయకులు ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. చేరిన వారిలో డీసీసీబీ డైరెక్టర్, చింతలపాలెం పీఏసీఎస్ చైర్మన్ వేములూరి రంగాచారి, గుడిమల్కాపురం మాజీ వార్డు మెంబర్ గండారపు రాముడు ఉన్నారు. ఈ సందర్భంగా వారికి మంత్రి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నందిరెడ్డి ఇంద్రారెడ్డి, డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవిరెడ్డి లక్ష్మారెడ్డి, నాయకులు నాగార్జునరెడ్డి, ప్రసాద్, కోట్యానాయక్, నజ్మాసైదా, రాజు, షబ్బీర్, పెద్దబాలు, మహేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

చివరిదశకు చేరిన డేటా ఎంట్రీ



సర్వే డేటా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న సిబ్బంది

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలో సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే పూర్తయింది. అలాగే సర్వే వివరాల డేటా ఎంట్రీ కార్యక్రమం కూడా చివరిదశకు చేరింది. ఆదివారం సెలవు రోజున కూడా ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో డేటా ఎంట్రీ నిర్వహించారు. డేటా ఎంట్రీ కార్యక్రమం చివరిదశకు చేరిందని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి తెలిపారు. డేటా ఎంట్రీకి 20 మంది కంప్యూటర్ ఆపరేటర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రేయింబవళ్లు డేటా ఎంట్రీ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ గోపి, ఎంపీఎస్ఓ సైదిరెడ్డి, గిర్దావర్ వెంకట్‌రెడ్డి, నర్సింహరాజు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించారు.. బ్రిడ్జి మరిచారు



బ్రిడ్జి నిర్మించాల్సిన ప్రదేశం

అర్వపల్లి : మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామ పంచాయతీ ఆవాసం తూర్పుతండాకు వెళ్లే రోడ్డుపై కాసర్లపహాడ్ చెరువు అలుగు వద్ద బ్రిడ్జిని నిర్మించి తమ కష్టాలు తీర్చాలని గిరిజనులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ తండాకు ఇటీవల రూ.2.10 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. కానీ రోడ్డు నిర్మాణంలో భాగంగా చేపట్టాల్సిన బ్రిడ్జి నిర్మాణాన్ని వదిలేశారు. దీంతో చెరువుఅలుగు వచ్చినప్పుడల్లా తండాకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇటీవల ఈ అలుగు వద్ద బ్రిడ్జి నిర్మాణం కోసం తవ్విన గుంతలలో గిరిజనులు పడి గాయాలపాలయ్యారు. ఇప్పటికైనా బ్రిడ్జి నిర్మాణం చేపట్టి తమ ఇబ్బందులు తీర్చాలని తండావాసులు కోరుతున్నారు.

కమ్ముకుంటున్న మబ్బులు.. రైతుల్లో ఆందోళన



అర్వపల్లిలోని ఐకేపీ కేంద్రంలో ధాన్యం తడవకుండా రాశులపై కప్పిన పట్టాలు

వర్షంతో కాంటా ఆగింది



సుమారు 400 బస్తాల సన్నధాన్యాన్ని తెచ్చి పోశాను. 17 శాతం వరకు తేమ ఉంది. వర్షంతో కొనుగోలు ప్రక్రియ ఆగింది. తొందరగా కొనుగోళ్లను పూర్తిచేసి ధాన్యం తడవకుండా చూడాలి.

– దేగల పద్మ, రైతు, కొత్తగూడెం

అర్వపల్లి : వర్షాలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు వర్షంతో తడుస్తున్నాయి. జాజిరెడ్డిగూడెం మండలంలో మొత్తం 23 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు గాను ఇప్పటికే 10కి పైగా కేంద్రాలలో ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయి. ఇక మిగిలిన కేంద్రాలలో కొనుగోళ్లు జరుగుతున్నాయి. మండల వ్యాప్తంగా సుమారు 15 వేల క్వింటాళ్లకు పైగానే ధాన్యం కేంద్రాలలో కొనుగోలు చేయాల్సి ఉంది. తుఫాన్ ప్రభావంతో ఆదివారం చిన్నపాటి వర్షం కురిసింది. ధాన్యం తడవకుండా రైతులు పట్టాలు కప్పిపెట్టారు. పెద్ద వర్షం పడితే ధాన్యం తడుస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం కొనుగోళ్లను వెంటనే పూర్తి చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం



మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మద్దిరాల : తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన నూతనకల్లు మండల కేంద్రానికి చెందిన తీగల గిరిధర్‌రెడ్డిని చందుపట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిపాల వెంకన్న, నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు పచ్చిపాల సుమతి, మద్దిరాల ప్రెస్ క్లబ్ సభ్యులు ఆదివారం వేర్వేరుగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పసుల అశోక్ యాదవ్, మద్దిరాల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వెంకన్న, సభ్యులు జి.లింగయ్య, బి.శ్రీనివాస్, వెంకన్న పాల్గొన్నారు.

నూతనకల్ : తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డిని తుంగతుర్తి, మద్దిరాల మండల కాంగ్రెస్ నాయకులు ఆదివారం మండల కేంద్రంలో సన్మానించారు. సన్మానించిన వారిలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల వెంకన్న, మహిళా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు పచ్చిపాల సుమతి, పసుల అశోక్ యాదవ్, ఉప్పుల రాంబాబు, వీరబోయిన గంగరాజు, ఉప్పుల శ్రీనివాస్, ఎండీ అబ్దుల్, బొల్క సైదులు తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

మద్దిరాల : మండల పరిధిలోని గోరెంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1993–1994 సంవత్సరం 10వ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా బుద్ధులు నేర్పిన ఆనాటి గురువులను ఘనంగా సన్మానించారు. పాఠశాలలో తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. స్నేహితుల కష్ట సుఖాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రంగారెడ్డి, క్రిష్టారెడ్డి, పూర్వ విద్యార్థులు పూసపెల్లి శ్రీనివాస్, మట్టిపెల్లి శ్రీశైలం, గిలకత్తుల పూర్ణచందర్, కాసం రమాదేవి, ఉమారాణి, మేడ్దుల అవిలయ్య, తాళ్లపెల్లి లింగయ్య, ప్రకాష్, గన్నె పరమేష్, వర్దెల్లి రవీందర్, పేర్ల మల్లయ్య, గోపాల క్రిష్టా తదితరులు పాల్గొన్నారు.

'మాలల సింహగర్జన'కు తరలిన నాయకులు



తుంగతుర్తి నుంచి సభకు వెళ్తున్న నాయకులు

అర్వపల్లి : హైదరాబాద్‌లో జరిగే సింహగర్జన సభకు మండలం నుంచి మాల మహానాడు ఆధ్వర్యంలో మాలలు ఆదివారం భారీగా తరలివెళ్లారు. తరలిన వారిలో మాల మహానాడు బాధ్యులు రెంటాల కరుణకుమార్, గండమళ్ల ఎల్లయ్య, పగిడిమర్రి శేఖర్, శ్రీరాములు, సంగెం సోమయ్య, మహేష్, ఉపేందర్, సంద రాములు, శ్రీను, ప్రకాశం, శకుంతల, భిక్షం, రవి, సైదులు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

నాగారం : హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగే మాలల సింహగర్జన బహిరంగ సభకు మండలం నుంచి మాలలు ఆదివారం భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా మాల మహానాడు మండల అధ్యక్షుడు పేరుమళ్ల జాన్‌వెస్లీ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మాలలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి సముచిత స్థానం కల్పించాలని అన్నారు. బహిరంగ సభకు తరలివెళ్లిన వారిలో మాల మహానాడు మండల ఉపాధ్యక్షుడు అమృతం, జాజుల సామేల్, ధార శ్రీను, కత్రయ్య, అశోక్, ఎల్క సైదులు, ఎల్క కృష్ణ, ప్రకాశ్, రాములు, ప్రసాద్, వెంకన్న, బాబు తదితరులు ఉన్నారు.

పెన్‌పహాడ్ : హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగే మాలల సింహగర్జన సభకు మాల మహానాడు మండల అధ్యక్షుడు తుమ్మకొమ్మ విజయ్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని వివిధ గ్రామాల నుంచి భారీగా తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో చింత రాంబాబు, వీరయ్య, సోమయ్య, జక్కి సంధ్య, నాగలక్ష్మి, వీరమ్మ, ఈశ్వరమ్మ, శ్రీను, సైదులు తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : హైదరాబాద్‌లో జరిగే మాలల సింహగర్జన బహిరంగ సభకు ఆదివారం మండల కేంద్రం నుంచి మాలలు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభకు తరలిన వారిలో మద్దెల ముత్తయ్య, మద్దెల ప్రేమయ్య, చిలుకూరి రాజు, శాంతయ్య, ప్రవీణ్, సతీష్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కళాజాతా



మొండికుంట తండాలో ప్రజాపాలనపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాజాతా సభ్యులు

తుంగతుర్తి : ప్రజా పాలన–ప్రజా విజయోత్సవాల్లో భాగంగా మొండికుంటతండా, కేశవాపురం, గానుగుబండ గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఆదివారం ప్రజలకు అవగాహన కల్పించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కు గ్యాస్ సిలిండర్, రైతు భరోసా, రైతుకు రూ.2లక్షల రుణమాఫీ, 200 యూనిట్ల ఉచిత కరెంట్, యువతకు ఉద్యోగాలు తదితర పథకాల గురించి కళాజాతా సభ్యులు తమ ఆట, పాటలతో వివరించారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతి సారథి టీం లీడర్ ఈర్ల సాయి, గడ్డం ఉదయ్, వెన్నెల నాగరాజు, పాలకుర్తి శ్రీకాంత్, మాగి శంకర్, పాక ఉపేందర్, మేడిపల్లి వేణు, గజ్జి మంజుల, సిరిపాంగి రాధ, మల్లెపాక శిరీష, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కార్తీక వన సమారాధన

హుజూర్‌నగర్ : కార్తీకమాసాన్ని పురస్కరించుకొని పట్టణంలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన, వన భోజన మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో..

పట్టణంలో ఆదివారం బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన భోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దంపతులచే సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. బ్రాహ్మణ సంఘం కమిటీని ఎన్నుకున్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో అన్నదానం

మునగాల : మండల కేంద్రం శివారులో గల అయ్యప్పస్వామి ఆలయ ఆవరణలో దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం కొనసాగుతోంది. ఆదివారం మండల కేంద్రానికి చెందిన వల్లోజు వెంకన్న గురుస్వామి –నళిని దంపతులు, పెన్‌పహాడ్ మండలానికి చెందిన సాయిబాబా అన్నదాన కార్యక్రమానికి సహకరించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తడకమళ్ల శ్రీనివాసాచారి గురుస్వామి తెలిపారు. కార్యక్రమంలో గురుస్వాములు, మాలధారులు వల్లోజు మహేష్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలు అందిస్తేనే సమాజంలో గుర్తింపు



ఉద్యోగ విరమణ పొందిన మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉద్యోగులు

నేరేడుచర్ల : ఉద్యోగులు విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందిస్తేనే సమాజంలో గుర్తింపు ఉంటుందని ట్రాన్స్‌కో మండల ఇన్‌చార్జ్ ఏఈ పందిరి శ్రీనివాస్ అన్నారు. నేరుడుచర్ల మండలంలోని ముకుందాపురం లైన్‌మన్‌గా పనిచేస్తున్న మోహన్‌రెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మోహన్‌రెడ్డి హెల్పర్ స్థాయి నుంచి లైన్‌మన్‌గా అనేక సేవలను అందించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ మల్లెపల్లి గురువయ్య, 1104 యూనియన్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింహారెడ్డి, రిటైర్డ్ లైన్ ఇన్‌స్పెక్టర్ ఖాదర్, లైన్‌మెన్‌లు పేతురు, విజయ్, ట్రాన్స్‌కో సిబ్బంది కృష్ణయ్య, కృష్ణారెడ్డి, సురేష్, మహేష్, నర్సిరెడ్డి, నరేందర్, ప్రేమ్‌కుమార్, వెంకటయ్య, కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

హుజూర్‌నగర్ : ప్రజాపాలన విజయోత్సవాలను పురస్కరించుకొని చింతలపాలెంలోని మండల రిసోర్స్ భవనంలో ఆదివారం విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో హుజూర్‌నగర్ మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 73మంది విద్యార్థులు పాల్గొన్నట్లు ఎంఈఓ శ్రీనివాస్ తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిన విద్యార్థులకు మంగళవారం బహుమతులు అందజేయడంతో పాటు వారిని జిల్లా స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు.